# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :145 EDITOR:CHERUKU UPENDAR, DATE : TUESDAY 10 OCTOBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 145 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : మంగళవారం 10 అక్టోబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## అంతరిక్షంలో స్పేస్ స్టేషన్

బెంగళూరు- ప్రభాత సూర్యుడు



ఇస్రో భవిష్యత్తులో అంతరిక్షంలో సొంతంగా స్పేస్ స్టేషన్‌ను నిర్మించడానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు ఛైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో ఆయన ఓ మీడియా సంస్థతో మాట్లాడారు.

మిగతా 2లో...

## 19వ ఆసియా క్రీడల్లో 107 పతకాలతో సత్తా చాటిన భారత్

హాంగ్జౌ - - ప్రభాత సూర్యుడు

72ఏళ్ల ఆసియా క్రీడల చరిత్రలో భారత బృందం తొలిసారి అత్యధిక పతకాలను సాధించింది. చైనాలోని హాంగ్జౌ వేదికగా జరిగిన 19వ ఆసియా క్రీడల్లో భారత్ 107 పతకాలతో సత్తా చాటింది. ఇందులో 28స్వర్ణ, 38రజత, 41 కాంస్య పతకాలతో 4వ స్థానానికి ఎగబాకింది. తొలి మూడు స్థానాల్లో చైనా, జపాన్, కొరియా ఉన్నాయి. 100 పతకాలే లక్ష్యంగా ఈసారి క్రీడల బరిలోకి దిగిన భారత్.. ఆ ఫీట్‌ను అందుకోవడానికి క్రీడల ప్రారంభం పోటీపడింది. 2018, 2014 ఆసియా క్రీడల్లో 70పతకాలతో 8వ స్థానానికే పరిమితమైన భారత్.. ఈసారి నాలుగు స్థానాలు మెరుగు పరుచుకోవడంతోపాటు

మిగతా 2లో...

# కాంగ్రెసోళ్లను నమ్మేవాళ్లున్నారా..!



- -రూ.200 పింఛన్ ఇవ్వనోళ్లు రూ.4వేలు ఇస్తారట
- ఢిల్లీ, గుజరాత్ గులాంలు తెలంగాణకు అవసరమా!
- మనకు కేసీఆర్ ఉన్నారు... వారెందుకు?
- ప్రగతి నివేదన సభలో మంత్రి కేటీఆర్


హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ నాయకులు తెలం గాణ ప్రాంతాన్ని 60 ఏళ్లు పీక్కుతిన్నారని.. అలాంటి వారిని నమ్మి ఓట్లు వేసేంత తెలంగాణ ప్రజ లు అంత బుద్ధి తక్కువతనంలో లేరని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖమంత్రి కల్వకుంట్ల తారకరామారావు అ న్నారు. ప్రత్యేక తెలంగాణను ఇవ్వకుండా వేలాది మంది పిల్లలను కాంగ్రెస్ పార్టీ పొట్ట న పెట్టుకుందని.. అలాంటి పార్టీని నమ్మి మోసపోకూడదని ప్రజలకు పిలుపునిచ్చారు. పరకాల పట్టణంలో ప్రగతి నివేదన సభను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ము ఖ్య అతిథిగా

మిగతా 3లో...

## కులగణనకు కట్టుబడి ఉన్నాం

-కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

దేశంలో కులగణనకు కాంగ్రెస్ నూటికి నూరు శాతం కట్టుబడి ఉందని ఆ సీనియర్ నేత, మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ చెప్పారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన చత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్‌లలో కులగణన చేపడతామని తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఎఐసిసి కార్యాలయంలో సోమవారం సిడబ్ల్యుసీ సమావేశం జరిగింది. నాలుగు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో సోనియా, రాహుల్, , ప్రియాంక, కాంగ్రెస్ పాలిత ముఖ్య మంత్రులు తదితరులు పాల్గొన్నారు.

మిగతా 2లో...

- తెలంగాణతో పాటు ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసిన సిఇసి
- తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మిజోరాంలో ఒకే దశలో పోలింగ్
- చత్తీస్‌గఢ్‌లో రెండు దశల్లో పోలింగ్
- డిసెంబరు 3న ఐదు రాష్ట్రాల ఫలితాలు
- ఐదు రాష్ట్రాల్లో 20.59 లక్షల ఓట్లు తొలగింపు
- 57.89 లక్షల కొత్త ఓటర్లు
- నవంబర్ 30న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు
- తెలంగాణలో 6,10,694 ఓట్లు
- తొలగింపు 17,01,087 కొత్త ఓటర్లు వృద్ధులకు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం

# మోగిన ఎన్నికల నగారా

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

దేశంలో మరోసారి ఎన్నికల సందడి మొదలైంది. తెలంగాణ సహా ఐదు రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు నవంబరు 30న జరగను న్నాయి. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం నాడిక్కడ ఆకాశవాణి భవన్‌లోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ, రాజస్థాన్, మిజోరాం, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ వివరాలను సిఇసి చీఫ్ రాజీవ్ కుమార్ వెల్లడించారు. తెలంగాణ, రాజస్థాన్, మిజోరాం, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఎన్నికలు ఒకే దశలో జరగనున్నాయని, చత్తీస్‌గఢ్‌లో రెండు దశల్లో జరగనున్నాయని తెలిపారు. ఐదు రాష్ట్రాల్లో డిసెంబరు 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. 'ఎన్నికల కోసం ఆరు నెలలుగా కసరత్తు చేస్తున్నాం.

మిగతా 2లో



## పాపం.. షర్మిల..!



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

షర్మిల ఒంటరిపోరుకు దిగితే.. కచ్చితంగా పాలేరు నుంచే పోటీ చేస్తారు. అప్పుడు ఎవరిని ప్రత్యర్థిగా చూస్తారనేది ఆసక్తికర అంశం. బీఆర్‌ఎస్ అభ్యర్థిని టార్గెట్ చేస్తారా లేదంటే పాలేరు టికెట్ ఆశిస్తున్న తుమ్మల నాగేశ్వరరావుతో ఫైట్ చేస్తారా? ఒకవేళ తుమ్మల గనక ఖమ్మం సీటు తీసుకుని, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాలేరు బరిలో దిగితే మాత్రం.. పోటీ మరింత రసవత్తరంగా ఉంటుంది. ఒకవిధంగా ఇది షర్మిలను ఇరుకునపెట్టడమే అవుతుందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఖమ్మంలో పదికి పది సీట్లు గెలుస్తామని పొంగులేటి శపథం చేసిన నేపథ్యంలో షర్మిలను గెలవనివ్వకపోవచ్చని చెబుతున్నారు. ఏదేమైనా.. విలీనంపై షర్మిల వేసిన అడుగులు లాభం కంటే నష్టమే ఎక్కువ తెచ్చిపెట్టింది. వైఎస్ మీద అభిమానం కావొచ్చు, సమస్యలపై షర్మిల పోరాడుతున్న తీరు కావొచ్చు. కొంతమంది నేతలైతే ఆమె వెనక నడిచారు. కాని, ఎప్పుడైతే విలీనం చేయాలనే ఆలోచన మొదలుపెట్టారో అప్పటి నుంచి ఒక్కో లీడర్ పార్టీని వీడుతూ వచ్చారు. కొండా రాఘవరెడ్డి, గట్టు రామచంద్రరావు, ఏపూరి సోమన్న.. ఇలాంటి వాళ్లంతా షర్మిల నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఇప్పుడు విలీనంపై వెనక్కి తగ్గినా.. మళ్లీ నేతలు తిరిగి వస్తారన్న

మిగతా 2లో

# బాబు పిటిషన్లు డిస్మిస్

## ■ హైకోర్టు, ఎసిబి కోర్టుల తీర్పులు ■ సుప్రీంలో కొనసాగుతున్న వాదనలు

అమరావతి - ప్రభాత సూర్యుడు

మూడు కేసులకు సంబంధించి మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబానాయుడు ముందస్తు బెయిల్ కోరుతు దాఖలు చేసిన ఫిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. ఈ మేరకు సోమవారం నాడు వేరువేరు తీర్పులు వెలువడ్డాయి. మరో వైపు ఎసిబి ప్రత్యేక కోర్టు కూడా చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను కొట్టేసింది. క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. అంతకుముందు ఫైబర్ గ్రిడ్ కేసు, ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు అల్లర్ల కేసుల్లో వేర్వేరుగా దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను డిస్మిస్ చేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి తీర్పులు వెలువరించారు. ఫైబర్ గ్రిడ్ కేసులో ఈ వాదనలు ఈ నెల 5న పూర్తి అయ్యాయి. తాజాగా వెలువరించిన తీర్పులో..చంద్రబాబును నిందితునిగా చేర్చడం వెనుక దురుద్దేశాలు ఉన్నాయనేందుకు ఆధారాలు చూపలేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ మార్పు కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్లపై గతంలోనే వాదనలు ముగిశాయి. ఈ పిటిషన్‌ను కూడా కొట్టేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అంగళు లో జరిగిన ఘర్షణల నేపథ్యంలో పోలీసులు నమోదు చేసిన కేసులో ముందు బెయిల్ ఇవ్వాలన్న చంద్రబాబు వినతిని హైకోర్టు తోసిపుచ్చింది.

### ఎసిబి కోర్టులో...

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటీషన్‌ను, సిఐడి దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను రెండింటిని ఎసిబి కోర్టు డిస్మిస్ చేసింది. ఈ మేరకు సోమవారం ఎసిబి కోర్టు న్యాయమూర్తి రెండు పిటీషన్‌లను కొట్టివేస్తూ తీర్పును వెలువరించారు. అలాగే ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ నెట్ కేసుల్లో దాఖలు చేసిన పిటి వారెంట్లపై విచారణను నేటికి వాయిదా





వేసింది.

### సుప్రీంలో సుదీర్ఘ వాదనలు

చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు నేటి(మంగళవారం)కి వాయిదా వేసింది. జస్టిస్ అనిరుద్ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేది నేతత్వంలోని ద్విసభ్య ధర్మాసనం ముందు సోమవారం వాదనలు సుదీర్ఘంగా సాగాయి. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, సిద్ధార్థ లూత్రా, అభిషేక్ సింగ్ మను వాదనలు వినిపించారు. 2021 సెప్టెంబర్ 7లో ఎఫ్‌ఐఆర్ నమోదు అయిందని, అందువల్ల 17ఏ వర్తిస్తుందని, గవర్నర్ అనుమతి తీసుకోవాలని అన్నారు. సిఐడి తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ ఈ కేసు దర్యాప్తు 2018కి ముందే ప్రారంభం అయిందని, కనుక 17ఏ వర్తించదని అన్నారు. హరీష్ సాల్వే స్పందిస్తూ కేసు దర్యాప్తు 2018కి ముందే జరిగిందని ప్రభుత్వం ఎటువంటి డాక్యుమెంట్ సమర్పించలేదన్నారు.

# కులగణనకు కట్టుబడి ఉన్నాం

(మొదటిపేజీ తరువాయి)

**కులగణనకు మోకాలడ్డుతున్న మోడీ**

దేశవ్యాప్తంగా కులగణనను చేపట్టేందుకు మోడీ ప్రభుత్వం మొండిగా నిరాకరిస్తున్నదని రాహుల్ విమర్శించారు. 'కులగణనకు ఆయన (మోడీ) సిద్ధంగా లేరు. మాకున్న నలుగురు ముఖ్యమంత్రుల్లో ముగ్గురు ఒబిసిలు ఉన్నారు. 10 మంది బిజెపి ముఖ్యమంత్రుల్లో ఒక్కరే ఒబిసి కేటగిరికి చెందిన వారున్నారని ఆయన అన్నారు. కుల గణన అనేది రాజకీయ పరమైన అంశం కాదు. న్యాయ ఆధారిత నిర్ణయం' అని రాహుల్ స్పష్టం చేశారు.

కులగణనకు తమ పార్టీ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని సోనియా అన్నారు. తాము అధికారంలోకి వస్తే వాయిదా పడుతూ వస్తున్న 2021 జనాభా లెక్కల సేకరణతోబాటే దేశవ్యాపితంగా కులగణనను చేపడతామని చెప్పారు. ఇందుకు సంబంధించి సిడబ్ల్యుసి ఒక తీర్మానం కూడా చేసిందని ఆమె తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసిలు) సహా మహిళలకు తగిన ప్రాతినిధ్యం ఉండేలా, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను సత్వర అమలుకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. 'మోడీ ప్రభుత్వం మహిళల రిజర్వేషన్ బిల్లును అమలుపై కాలయాపన చేసేలా జనాభా లెక్కలు, డీలిమిటేషన్ వంటి అడ్డంకులు సృష్టించిందని, తాము వీటన్నిటినీ తొలగిస్తామని కాంగ్రెస్ పార్టీ ఆ తీర్మానంలో పేర్కొంది. జనాభాలో వారి నిష్పత్తికి అనుగుణంగా ఒబిసిలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగిస్తూ చట్టం తేవాలని డిమాండ్ చేసింది.

**ఐదు రాష్ట్రాల్లో విజయానికి ఐక్యతతో పని చేయాలి : ఖర్గే**

త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు తమ శక్తియుక్తుల తోపాటు సమన్వయం, క్రమశిక్షణ, ఐక్యతతో పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'ద్రవ్యోల్బణం, నిరుద్యోగం కట్టడి, పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. మణిపూర్‌కు ఒక్కసారి కూడా వెళ్లని ప్రధాన మంత్రి, ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు పదేపదే వెళ్తున్నారని ఆయన విమర్శించారు. హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటకలో నిర్ణయాత్మక విజయాల తర్వాత పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాహం వచ్చిందని, రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోను గెలిచేందుకు కలసికట్టుగా కృషి చేయాలని ఖర్గే కాంగ్రెస్ శ్రేణులను కోరారు.

# అంతరిక్షంలో స్పేస్ స్టేషన్

(మొదటిపేజీ తరువాయి)

భవిష్యత్‌లో ఎన్నో రకాల మిషన్లు చేపట్టబోతున్నామని.. స్పేస్ స్టేషన్, దీర్ఘకాలం ప్రయాణించగలిగే మానవ సహిత స్పేస్‌ఫ్లైట్ ఆ జాబితాలో ఉన్నాయన్నారు. చంద్రయాన్ మిషన్ విజయవంతమైన తర్వాత అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నామని సైన్స్‌తో ఎలాంటి ప్రయోగాలు చేయాలని ఆలోచిస్తున్నట్లు చెప్పారు. స్పేస్ స్టేషన్ భారత ఆర్థిక వ్యవస్థకు ఏ విధంగా లాభం చేకూరుస్తుందో పరిశీలిస్తున్నామని సోమ్‌నాథ్ అన్నారు. చంద్రయాన్ తర్వాత భారత్ గగన్‌యాన్‌పై దృష్టి సారించింది. వ్యోమగాములను అంతరిక్షానికి పంపి, అక్కడ స్పేస్ స్టేషన్ నిర్మించాలని యోచిస్తోంది. ఇదే విషయంపై సోమ్‌నాథ్ తాజాగా మాట్లాడుతూ సమీప భవిష్యత్తులో స్పేస్ స్టేషన్‌ను నిర్మించడానికి ప్రణాళిక రచిస్తున్నామని అన్నారు. రోబోటిక్ ఆపరేషన్‌తో ఆ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం మానవ సహిత ఫ్లైట్ సామర్థ్యం భారత్‌కు లేనందున ఆ పనిపై దృష్టి కేంద్రీకరించామని పేర్కొన్నారు. గగన్‌యాన్‌తో ఆ దిశగా ముందుకు వెళ్తున్నామని వివరించారు. అది సాధ్యమైతే రాబోయే 20-25 ఏళ్లలో స్పేస్ స్టేషన్ నిర్మాణం జరుగుతుందని అన్నారు. మానవ సహిత అన్వేషణ, స్పేస్‌ఫ్లైట్ రూపకల్పన కూడా ఇస్రో అజెండాలో ఉందని చెప్పారు. అది సాధ్యమైతే ఇస్రో అమెరికా, రష్యా, చైనా సరసన భారత్ నిలుస్తుందన్నారు.

# మరో కొత్త పథకంతో సర్కార్

మహబూబ్ నగర్- ప్రభాత సూర్యుడు

తెలంగాణ సర్కార్ మరో కొత్త స్కీమ్ ప్రకటించింది. రాష్ట్రంలోని ఎరుకల సామాజిక వర్గానికి సాయం చేసేందుకు ముందుకొచ్చింది. రూ.60 కోట్ల నిధులతో 'ఎరుకల సాధికారత' పథకాన్ని ప్రకటించింది. ఈ స్కీమ్ ను ట్రైకార్ ద్వారా అమలు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఎన్నికలు సమీపించిన వేళ బీఆర్ఎస్ సర్కార్ మరో కొత్త స్కీమ్ ను ప్రకటించింది. దళితబంధు తరహాలోనే ఎరుకల సామాజికవర్గం వారికోసం ఎరుకల సాధికారత పథకాన్ని తీసుకొచ్చింది.ఈ ఆర్థిక సంవత్సరానికిగాను రూ.60 కోట్లు కేటాయించింది. వైఈఎస్ పథకానికి సంబంధించిన విధివిధానాలను శనివారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.ఈ స్కీమ్ కింద ముఖ్యంగా పందుల పెంపకం, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం , ప్యాకేజింగ్, రవాణా, దుకాణాల కార్యకలాపాలు చేపట్టాల్సి ఉంటుంది. రాష్ట్రంలో చూస్తే ఎస్టీ జనాభాలో 4.54 శాతంగా ఎరుకలు ఉన్నారు. వీరు ప్రధానంగా పందుల పెంపకంపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. రాష్ట్రంలో 1.44 లక్షలు ఉన్న ఎరుకల జనాభా ఉంది. అయితే వీరి వృత్తిలో అనేక సవాళ్లను ఎదుర్కొనడంతో పాటు పట్టణాల్లో నిబంధనల కారణంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి సాధికారిత కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ స్కీమ్ ను తీసుకొచ్చింది. సామాజిక సంఘాల ద్వారా ఈ పథకం అమలు చేయాలని భావిస్తోంది.

**గరిష్టంగా రూ 30 లక్షలు?.**

-ఎరుకుల సాధికారిత పథకంలో చూస్తే ఒక్కో యూనిట్‌కు 50 శాతం (గరిష్ఠంగా రూ.30 లక్షలు) రాయితీగా అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మిగతా 50 శాతం వ్యయంలో 40 శాతం బ్యాంకు రుణంగా, 10 శాతం లబ్ధిదారుడి వాటా ఉంటుంది.

-పందుల పెంపకం యూనిట్ జనావాసాలకు 3 నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉండాలి.

-సొంతంగా రెండు ఎకరాల స్థలం ఉండాలి. లేదా ఏడేళ్ల కాలపరిమితితో లీజుకు ఒప్పందం చేసుకోవాలి.

-ఈ సరికొత్త పథకం మంజూరు కోసం జిల్లా స్థాయిలో కలెక్టర్ల అధ్యక్షతన కమిటీ పని చేయనుంది.

## 19వ ఆసియా క్రీడల్లో

# 107 పతకాలతో సత్తా చాటిన భారత్

(మొదటిపేజీ తరువాయి)

37 పతకాలను అధికంగానూ సాధించింది. అలాగే 655మందితో భారీ బృందం చైనాకు పయనం కాగా.. అథ్లెటిక్ విభాగంలోని 22కేటగిరీల్లో ఈసారి అత్యధికంగా 29 పతకాలు దక్కాయి. షూటింగ్(22), ఆర్చరీ(9) విభాగాల్లో భారత్‌కు టాప్-3లో పతకాలు దక్కాయి. షూటింగ్‌లో దక్కిన పతకాల్లో ఏకంగా 7 స్వర్ణాలు ఉండగా.. అథ్లెటిక్స్ విభాగంలో ఆ తర్వాత 6 స్వర్ణాలు వచ్చాయి. ఆర్చరీలోనూ వచ్చిన 9 పతకాల్లో 6 స్వర్ణాలున్నాయి.

క్రికెట్, కబడ్డీలో రెండు విభాగాల (పురుషుల, మహిళల) జట్లు బంగారు పతకాలను సాధించగా.. హాకీలో పురుషుల జట్టు పసిడిని ముద్దాడితే.. మహిళల జట్టు తొలిసారి కాంస్య పతకాన్ని చేజిక్కించుకుంది. స్క్వాష్‌లోనూ ఈసారి ఎన్నడూ రాణి విధంగా అత్యధిక పతకాలు దక్కాయి. ఇందులో రెండు స్వర్ణాలు ఉన్నాయి. బ్యాడ్మింటన్, టెన్నిస్, ఈక్వెస్ట్రియన్‌లో తొలిసారి బంగారు పతకాలు భారత్‌కు దక్కాయి. ఇదే ప్రదర్శనను 2024 పారిస్ ఒలింపిక్స్‌లోనూ మన అథ్లెట్లు చూపితే భారత్‌కు మరిన్ని పతకాలు దక్కడం ఖాయం. ఇక అథ్లెట్లను క్రీడలకు సన్నద్ధతకు కల్పించే సౌకర్యాల్లోనూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. 19వ ఆసియా క్రీడల నిర్వహణను చైనా ఛాలెంజ్‌గా తీసుకొంని సమర్థవంతం నిర్వహించింది. ఆసియా క్రీడలు జరిగిన హాంగ్జౌ నగరంలో ఆ 15రోజులు ఎలాంటి అంవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. క్రీడల్లో పాల్గొని తిరిగి వెళ్లేటప్పుడు అధికారులు, అథ్లెట్లు, పర్యాటకులు మాట్లాడుతూ.. వసతి, భోజన, ప్రయాణ సౌకర్యాలన్నీ 'పర్ఫెక్ట్‌లీ ఓకే' అని పేర్కొనడం విశేషం.

భారత్ సాధించిన పతకాలు(స్వర్ణ, రజత, కాంస్యాలు)

1. అథ్లెటిక్స్ : 29 (6, 14, 9)
2. షూటింగ్ : 22 (7, 9, 6)
3. ఆర్చరీ : 9 (5, 2, 2)
4. రెజ్లింగ్ : 6 (0, 1, 5)
5. స్క్వాష్ : 5 (2, 1, 2)
6. రోయింగ్ : 5 (0, 2, 3)
7. బాక్సింగ్ : 5 (0, 1, 4)
8. క్రికెట్ : 2 (స్వర్ణాలు)
9. కబడ్డీ : 2 (స్వర్ణాలు)
10. బ్యాడ్మింటన్: 3 (1, 1, 1)
11. టెన్నిస్ : 2 (1, 1, 0)
12. ఈక్వెస్ట్రియన్: 2 (1,0, 1)
13. హాకీ : 2 (1, 0, 1)
14. చెస్ : 2 (రజతం)
15. పాడ్లె : 3 (0, 1, 2)
16. స్కేటింగ్ : 2(కాంస్యం)
17. బ్రిడ్జ్ : 1 (రజతం)
18. గోల్ఫ్ : 1 (రజతం)
19. వుషూ : 1 (రజతం)
20. కనోయింగ్: 1 (కాంస్యం)
21. సెపక్‌తక్రా : 1 (కాంస్యం),
22. టేబుల్ టెన్నిస్: 1 (కాంస్యం)

# మోగిన ఎన్నికల నగారా

(మొదటిపేజీ తరువాయి)

వివిధ రాజకీయ పార్టీల నుంచి అభిప్రాయాలు సేకరించాం. ఐదు రాష్ట్రాల అధికారులు, పార్టీల నేతలతో చర్చలు జరిపాం. ఐదు రాష్ట్రాల్లో మొత్తం 679 అసెంబ్లీ స్థానాలకు గాను ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో 60 లక్షల మంది తొలిసారి ఓటు హక్కు పొందారు. అన్ని రాష్ట్రాల్లో మహిళా ఓటర్ల సంఖ్య పెరిగింది. ఐదు రాష్ట్రాల్లో 1.77 లక్షల పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. 16.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అందులో 8.2 కోట్ల పురుషులు, 7.8 కోట్ల మహిళలు ఉన్నారు. 20,59,539 ఓట్లు తొలగించాం. 57,89,227 కొత్త ఓటర్లు జత చేశాం. 18.37 లక్షల మంది 18-19 ఏళ్ల వయసు గల ఓటర్లను జత చేశాం. మిజోరం, చత్తీస్‌గఢ్‌లో మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. ఈ ఎన్నికల్లో వృద్ధులకు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పించాం. ఐదు రాష్ట్రాల్లో తక్షణమే సోమవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది' అని రాజీవ్ కుమార్ వెల్లడించారు.

**తెలంగాణ ఎన్నికల షెడ్యూల్**

తెలంగాణలో 119 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో నవంబరు 30న ఎన్నికలు జరగనున్నాయి. నోటిఫికేషన్ నవంబరు 3న విడుదల కానుంది. నామినేషన్లకు గడువు నవంబరు 10 వరకు ఉంది. నామినేషన్ల పరిశీలన నవంబరు 13న జరగనుంది. ఉపసంహరణ గడువుగా నవంబరు 15 విధించారు. నవంబరు 30న పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు డిసెంబరు 3న జరగనుంది. అదే రోజు ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

తెలంగాణలో 3,17,17,389 మంది ఓటర్లు ఉన్నారు. 1.58 కోట్ల పురుషులు, 1.58 కోట్ల మహిళలు ఉన్నారు. వికలాంగులు 5,06,493 మంది, థర్డ్ జండర్ 2,557 మంది, సీనియర్ సిటిజన్స్ 4,43,943 మంది ఉన్నారు. 3,35,043 మంది ఓటర్లు 18-19 ఏళ్ల వయసు గలవారు. 17,01,087 మంది కొత్త ఓటర్లు. 6,10,694 ఓట్లు తొలగించారు. తెలంగాణలో జెండర్ రేషియో 998 ఉంది. 35,356 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో 14,464 పోలింగ్ స్టేషన్లు కాగా, గ్రామీణ ప్రాంతాల్లో 20,892 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. 119 అసెంబ్లీ స్థానాల్లో 88 జనరల్ కేటగిరి కాగా, 19 ఎస్సి, 12 ఎస్‌టి రిజర్వుడు స్థానాలు ఉన్నాయి. 2018 డిసెంబరు 7న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్ర అసెంబ్లీ ప్రస్తుత పదవీకాలం 2024 జనవరి 16న ముగియనున్నది.

**రాజస్థాన్‌లో నవంబరు 23న ఎన్నికలు**

200 సీట్లున్న రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఒకే దశలో నవంబరు 23న జరగనున్నాయి. రాజస్థాన్‌లో 5,25,38,655 మంది ఓటర్లు ఉన్నారు. 2.73 కోట్ల పురుషులు, 2.52 కోట్ల మహిళలు ఉన్నారు. 4,15,418 మంది ఓటర్లు 18-19 ఏళ్ల వయసు గలవారు. 10,57,251 మంది కొత్త ఓటర్లు. 3,95,934 ఓట్లు తొలగించారు. మొత్తం 51,756 పోలింగ్ స్టేషన్లు ఉండగా, అందులో 10,415 పట్టణ ప్రాంతాల్లోనూ, 41,341 పోలింగ్ స్టేషన్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. 200 అసెంబ్లీ స్థానాల్లో 144 జనరల్ కేటగిరి కాగా, 25 ఎస్‌సి, 43 ఎస్‌టి రిజర్వుడు స్థానాలు ఉన్నాయి. రాజస్థాన్ అసెంబ్లీ గడువు జనవరి 14తో ముగియనుంది.

**నవంబరు 17న మధ్యప్రదేశ్ ఎన్నికలు**

230 సీట్లున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ఒకే దశలో నవంబరు 17న జరగనున్నాయి. 5,60,60,925 మంది ఓటర్లు ఉన్నారు. 2.88 కోట్ల పురుషులు, 2.72 కోట్ల మహిళలు ఉన్నారు. 7,78,789 మంది ఓటర్లు 18-19 ఏళ్ల వయసు గలవారు. 19,89,508 మంది కొత్త ఓటర్లు. 7,45,211 ఓట్లు తొలగించారు. మొత్తం 64,523 పోలింగ్ స్టేషన్లు ఉండగా, అందులో 16,763 పట్టణ ప్రాంతాల్లోనూ, 47,760 పోలింగ్ స్టేషన్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి.

230 అసెంబ్లీ స్థానాల్లో 148 జనరల్ కేటగిరి కాగా, 35 ఎస్‌సి, 47 ఎస్‌టి రిజర్వుడు స్థానాలు ఉన్నాయి. మధ్యప్రదేశ్ అసెంబ్లీ గడువు జనవరి 6తో ముగియనుంది.

ఎన్నికల ప్రక్రియ తేదీ

నోటిఫికేషన్ అక్టోబరు 21 (శనివారం)

నామినేషన్ల దాఖలుకు గడువు అక్టోబరు 30 (సోమవారం)

నామినేషన్ల పరిశీలన అక్టోబరు 31 (మంగళవారం)

ఉపసంహరణకు గడువు నవంబరు 2 (గురువారం)

పోలింగ్ నవంబరు 17 (శుక్రవారం)

ఓట్ల లెక్కింపు డిసెంబరు 3 (ఆదివారం)

**మిజోరంలో నవంబరు 7న ఎన్నికలు**

40 సీట్లున్న మిజోరం అసెంబ్లీ ఎన్నికలు ఒకే దశలో నవంబరు 7న జరగనున్నాయి. 8,51,895 మంది ఓటర్లు ఉన్నారు. 4.13 లక్షల పురుషులు, 4.39 లక్షల మహిళలు ఉన్నారు. 9,677 మంది ఓటర్లు 18-19 ఏళ్ల వయసు గలవారు. 30,682 మంది కొత్త ఓటర్లు. 16,826 ఓట్లు తొలగించారు. మొత్తం 1,276 పోలింగ్ స్టేషన్లు ఉండగా, అందులో 525 పట్టణ ప్రాంతాల్లోనూ, 751 పోలింగ్ స్టేషన్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. 40 అసెంబ్లీ స్థానాల్లో 1 జనరల్ కేటగిరి కాగా, 39 ఎస్‌టి రిజర్వుడు స్థానాలు ఉన్నాయి. మిజోరం అసెంబ్లీ గడువు డిసెంబరు 17న ముగియనుంది.

**రెండు దశల్లో చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు**

90 సీట్లున్న చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో జరగనున్నాయి. నవంబరు 7న తొలి దశ మిజోరంతోనూ, నవంబరు 17న రెండో దశ ఓటింగ్ మధ్యప్రదేశ్‌తోనూ జరగనుంది. 2,03,60,240 మంది ఓటర్లు ఉన్నారు. 1.01 కోట్ల పురుషులు, 1.02 కోట్ల మహిళలు ఉన్నారు. 2,98,073 మంది ఓటర్లు 18-19 ఏళ్ల వయసు గలవారు.

10,10,699 మంది కొత్త ఓటర్లు. 2,90,874 ఓట్లు తొలగించారు. మొత్తం 24,109 పోలింగ్ స్టేషన్లు ఉండగా, అందులో 4,815 పట్టణ ప్రాంతాల్లోనూ, 19,258 పోలింగ్ స్టేషన్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. 90 అసెంబ్లీ స్థానాల్లో 51 జనరల్ కేటగిరి కాగా, 10 ఎస్‌సి, 29 ఎస్‌టి రిజర్వుడు స్థానాలు ఉన్నాయి. చత్తీస్‌గఢ్ అసెంబ్లీ గడువు జనవరి 3తో ముగియనుంది.

# పాపం.. షర్మిల

(మొదటిపేజీ తరువాయి)

గ్యారెంటీ లేదు. ఓవరాల్‌గా రాజకీయ పరిణతి లేకపోవడంతోనే షర్మిల కొన్ని రాంగ్ స్టెప్స్ వేశారన్నది రాజకీయ విశ్లేషకుల మాట. షర్మిలలో రాజకీయ పరిణితి కూడా కనిపించలేదంటున్నారు పొలిటికల్ అనలిస్టులు. కష్టమో నష్టమో ముందు పార్టీని నడపాలి. ఎన్నికల్లో పోటీ చేయాలి. గెలుపో ఓటమో తరువాత సంగతి. అసలు పార్టీకి ఉన్న సత్తా ఏంటన్నది బయటపడుతుంది కదా. సీట్లు గెలవకపోయినా.. చూపించడానికి కనీసం ఓట్ షేర్ అయినా ఉంటుంది కదా. ఇవేమీ జరక్కుండానే పార్టీ విలీనం కోసం ప్రయత్నించడం అంటే.. ఫెయిల్యూర్‌ను అంగీకరించడం కాదా? ఏ ఒక్క ఎన్నికను ఫేస్ చేయకుండానే విలీన ప్రతిపాదన పెట్టారంటే.. పార్టీని నడపడం అంత ఈజీ కాదని షర్మిలకు అర్థమై ఉండాలి. 4వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసినా ఆ రేంజ్ రెస్పాన్స్ రాలేదని తెలుసుకుని ఉండాలి. లేదా ఆర్థిక వనరులైనా అడ్డం వచ్చి ఉండాలి. ఇవన్నీ పార్టీ అధ్యక్షురాలిగా తనకే అర్థమైపోతున్నప్పుడు.. రాజకీయాల్లో కాకలుతీరిన నేతలకు ఆమాత్రం అర్థం కాదా? విలీనం కోసం నాలుగు నెలలుగా వెంటపడుతున్నారంటే.. తెలంగాణలో ప్రభావం చూపించలేకపోయారు కాబట్టే పార్టీని కాంగ్రెస్‌లో కలిపేస్తున్నారని.. చూస్తున్నవాళ్లు అర్థం చేసుకోలేరా? అసలు విలీనం ఊసెత్తకుండా.. ఆ పాలేరుపై ఫోకస్ పెట్టినా బాగుండేదని అంటున్నారు. ఏమో గెలుపు అవకాశాలు ఉండేవేమో. కాని, ఇన్నాళ్లు విలీనం కోసం ప్రయత్నించి, ఇప్పుడు ఒంటరిగా పోటీ చేస్తున్నా.. పాలేరులో గెలిపించండి అంటే ప్రజలు ఆదరిస్తారా? దీన్నే రాజకీయ పరిణితి లోపించడం అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. పైగా పాదయాత్రలో సమస్యలపై గళం వినిపించాల్సిందిపోయి.. ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని కూడా లెక్కలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇక రాజన్నరాజ్యం తెస్తానన్న కాన్సెప్ట్ తెలంగాణలో ఎంత వరకు ఇంపాక్ట్ చూపిస్తుందో ఆలోచించకపోవడం కూడా మైనస్‌గానే చూస్తున్నారు. పార్టీని విలీనం చేస్తే ఇందిరమ్మ రాజ్యం, రాజీవ్ పేరునే పలకాలి తప్ప రాజన్నరాజ్యం అంటే కుదరదు. బహుశా ఈ అంశం కూడా విలీనానికి అడ్డొచ్చి ఉండాలి. షర్మిల పార్టీలో చేరితే నేతల మధ్య ఓ చీలిక తీసుకురావొచ్చన్న అనుమానాలను కేంద్ర నాయకత్వానికి కొందరు నేతలు చెప్పి ఉంటారని తెలుస్తోంది. పైగా కాంగ్రెస్ పార్టీకే డెడ్‌లైన్ పెట్టి.. పార్టీని కలిపేసుకుంటారా లేదా అనడం కూడా కరెక్ట్ కాదంటున్నారు. కారణాలు ఏవైతేనేం ఇప్పటికైతే విలీనం ఆగినట్టే. కాంగ్రెస్ అధిష్టానం నుంచి పిలుపువస్తే మళ్లీ ఆలోచిస్తారు. లేదంటే ఒంటరిపోరు తప్పదు. ఒంటరిపోరుపై ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోబోతున్నారని, ప్రెస్‌మీట్ పెట్టబోతున్నారని టాక్ నడుస్తోంది. 9వ తేదీ నుంచి వైఎస్‌ఆర్‌టీపీ నుంచి పోటీ చేయాలనుకునే అభ్యర్థుల కోసం దరఖాస్తులను కూడా ఆహ్వానించాలనుకుంటున్నారు. సో, ఈలోపు జరగాల్సిన కార్యక్రమాలు పూర్తి చేస్తూ.. ఢిల్లీ నుంచి పిలుపు వస్తే ఆలోచిద్దాం అనే రీతిలో షర్మిల వ్యూహం సాగుతోంది.ట్రబుల్ షూటర్ డీకే శివకుమార్ ద్వారా హైకమాండ్‌కు ప్రతిపాదనలు పంపినా పని అవలేదంటే.. ఏవో బలమైన కారణాలే ఉండి ఉండాలి. ఇందులో ప్రధానంగా కనిపిస్తున్నది షర్మిల మూలాలే. ఆమె సీమాంధ్రకు చెందిన వ్యక్తి కావడం, ఉద్యమ సమయంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాటలు, అప్పట్లో రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా షర్మిల చేసిన కామెంట్లు.. ఇవే విలీనానికి ప్రధాన అడ్డంకిగా మారాయంటున్నారు. 2018లో టీడీపీతో కాంగ్రెస్ జతకట్టినందుకు.. సెంటిమెంట్ అస్త్రం ఎలా ప్రయోగించారో అందరూ చూశారు. ఎన్నికల ముందు అలాంటి తప్పిదం చేయొద్దని హైకమాండ్‌కు రాష్ట్ర నాయకత్వం బలంగా చెప్పిందంటున్నారు. టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారినా.. ఆంధ్ర ప్రాంత నాయకులు తెలంగాణ రాజకీయాల్లో అడుగుపెట్టడాన్ని అధికార పార్టీ వ్యతిరేకిస్తోంది. అసలు కాంగ్రెస్ పార్టీలోనే ఆ వ్యతిరేకత కనిపించింది. వీహెచ్, రేణుకా చౌదరి లాంటి వాళ్లు షర్మిల రాకను ఆహ్వానించడం లేదు. వెళ్లి ఆంధ్రాలో రాజకీయాలు చేసుకోండని డైరెక్టుగానే చెప్పేశారు. సో, ఎట్టిపరిస్థితుల్లోనూ షర్మిల పార్టీ విలీనం వద్దే వద్దని రాష్ట్ర నాయకులు హైకమాండ్‌కు చెప్పి ఉంటారు.మరోవైపు సునీల్ కనుగోలు టీమ్ కూడా షర్మిల పార్టీ విలీనంపై గట్టిగానే సర్వే చేసిందని చెబుతున్నారు.

వైఎస్‌ఆర్‌టీపీని విలీనం చేసుకుంటే లాభమా, నష్టమా అనే దానిపై కొన్ని శాంపిల్స్ కలెక్ట్ చేసిందంటున్నారు. అందులో నెగటివ్ ఫీడ్‌బ్యాక్ రావడంతోనే హైకమాండ్ కూడా వెనకడుగు వేసినట్టు చెబుతున్నారు. లేదంటే.. డీకే శివకుమార్ చెప్పిన తరువాత దాదాపుగా విలీన ప్రక్రియ ఆగకూడదు. అయినా సరే ఆగిందంటే.. సునీల్ కనుగోలు ఇచ్చిన రిపోర్ట్ కూడా ఓ కారణమని తెలుస్తోంది. కర్నాటక ఎన్నికల్లోనూ వ్యూహకర్త సునీల్ కనుగోలు మాటలనే అక్కడి కాంగ్రెస్ నేతలు విన్నారు. సో, డీకే శివకుమార్‌ను నొప్పించుకుండా ఉండడం కోసం ఓ సర్వే చేయించి, ఆ రిపోర్ట్ ఆధారంగానే విలీనంపై వెనకడుగు వేశారని చెప్పుకుంటున్నారు. పైగా విలీనం కోసం ఇటు షర్మిల అటు కాంగ్రెస్ అధిష్టానం కొన్ని షరతులు పెట్టుకున్నట్టు తెలుస్తోంది. పాలేరు టికెట్‌తో పాటు 20 అసెంబ్లీ స్థానాలు షర్మిల అడిగినట్టు చెబుతున్నారు. హైకమాండ్ మాత్రం ఏపీ రాజకీయాలకే ఒప్పుకోవాలని, కావాలంటే రాజ్యసభ సీటు ఇస్తామని ఆఫర్ చేసినట్టు చెబుతున్నారు.

## సంపాదకీయం

# చాట్ జీపీటీ కంటే విద్యార్థులే నయం

ఇప్పుడు ప్రపంచం అంతా చాట్ జీపీటీ (చాట్ జనరేటివ్ ప్రీ-ట్రైన్డ్ ట్రాన్స్ ఫార్మర్)పైనే చర్చ జరుగుతోంది. దీనిపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదుగుతోంది. ఎంతో మంది చాట్ జీపీటీపైనే ఆధారపడుతున్నారు. ఏఐతో ఎన్నో అద్భుతాలు ఆవిష్కృతమవుతున్నాయి. ఈ చాట్ బోట్ మనిషి చేసే చాలా పనులను చేస్తుంది. అందుకే పలు కంపెనీలు ఏఐతో పనులు చేస్తూ ఉద్యోగులను తొలగిస్తున్నాయి. అయితే, ఇది అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందని, దీని ఉపయోగం పెరిగేకొద్దీ అదే స్థాయిలో ఉద్యోగాల సంఖ్య తగ్గిపోతుందని అత్యధిక మంది భయం వ్యక్తం చేస్తున్నారు. అయితే, చాట్ జీపీటీ వల్ల ఆశించినంత ప్రయోజనం లేదని, ఈ ఓపెన్ ఏఐను స్థాపించిన సంస్థ (అమెరికన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ లేబరేటరీ) సంక్షోభంలో ఉందని, అది వచ్చే ఏడాదికి దివాలా తీస్తుందని మరికొందరు అంటున్నారు. ఈ రెండు వాదనలు సరైనవి కావు. ఏఐ వల్ల కొంత ప్రయోజనం ఉన్నమాట నిజమే. అయితే, దాని వల్ల ఉద్యోగాలు భారీ స్థాయిలో కోల్పోయే మాట వాస్తవం కాదు. దీనివల్ల కొన్ని లాభాలు ఉన్నాయి. అలాగే, నష్టాలు కూడా ఉన్నాయి. చాట్ జీపీటీ, ఇది గూగుల్‌కు ప్రత్యామ్నాయంగా అభివృద్ధిపరిచినట్లుగా భావించవచ్చు. ఉదాహరణకు మనకు ఏదైనా ఒక అంశానికి సంబంధించిన సమాచారం కావాలంటే గూగుల్‌లో సెర్చ్ చేస్తే, దానికి సంబంధించి వివిధ వెబ్ సైట్లలో ఉండే సమాచారం చూపుతుంది. వాటిలో నుంచి మనకు కావలసిన సమాచారం తీసుకోవాలి. చాట్ జీపీటీలో అయితే, మనకు కావలసిన అంశానికి సంబంధించిన సమాచారం గుత్తగా ఒకేచోట లభిస్తుంది. ఉదాహరణకు హైదరాబాద్ లేక అమరావతి అని ఎంటర్ చేస్తే, గూగుల్‌లో వాటికి సంబంధించిన చాలా రకాల సమాచారం వస్తుంది. చాట్ జీపీటీలో అయితే, హైదరాబాద్ లేక అమరావతి సమాచారం ఒకేచోట లభిస్తుంది. ఆ సౌలభ్యం ఇందులో ఉంది. ఇందులో అపారమైన సమాచారం ఉంటుంది. టెక్ట్స రూపంలో ఏ ప్రశ్న అడిగినా టెక్ట్స రూపంలో సమాధానం ఇస్తుంది. అయితే, ఇందులో ఈ సమాచారం మ్యాజిక్ ద్వారా ఏమీ రాదు. దానిని ఉద్యోగులే సేకరించి, ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తుంటారు. అయినా, ఆ సమాచారంలో చాలా లోపాలు ఉంటుంటాయి. ఆ లోపాలను ఉద్యోగులే సరిదిద్దాలి. అందువల్ల కొన్నిచోట్ల ఉద్యోగాలు పోతే, మరికొన్నిచోట్ల కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. ఇందుకు సంబంధించి పరిశోధనా ఫలితాలను పరిశీలిద్దాం. అకౌంటింగ్ పరీక్షలో చాట్ జీపీటీ కంటే విద్యార్థులే మెరుగైన ప్రతిభ కనబరిచారు. విద్యార్థుల సరాసరి స్కోర్ 76.7 శాతం ఉండగా, చాట్ జీపీటీ స్కోర్ 47.4 శాతం మాత్రమే ఉంది. అమెరికాలో బ్రింగ్‌హ్యామ్ యంగ్ యూనివర్సిటీ(బీవైయూ)తోపాటు మరో 186 ఇతర యూనివర్సిటీలకు చెందిన పరిశోధకులు అకౌంటింగ్ పరీక్షల్లో చాట్‌జీపీటీ ఎలా పని చేస్తుందో విస్తృత స్థాయిలో పరిశీలించారు. వారు తెలుసుకున్న విషయాలను అకౌంటింగ్ ఎడ్యుకేషన్ జర్నల్‌లో ప్రచురించారు. చాట్ జీపీటీ కంటే విద్యార్థులే తెలివైనవారని తేల్చారు. అయితే 11.3 శాతం ప్రశ్నల విషయంలో చాట్ జీపీటీ స్కోర్ మెరుగ్గా ఉందని తేలింది. అకౌంటింగ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఆడిటింగ్‌లో ఫలితాలు మెరుగ్గా ఉన్నాయి. ట్యాక్స్, ఫైనాన్షియల్, మేనేజరియల్ అసెస్‌మెంట్‌లో ఫలితాలు అధ్వాన్నంగా ఉన్నాయి. మేథమెటికల్ ప్రక్రియల్లో ఇబ్బందులు ఎదురైనట్లు గమనించారు. చాట్ జీపీటీ వేదిక ఓపెన్ ఏఐ అతి త్వరలోనే ఆర్థిక సంక్షోభంలోకి జారుకోనుందని అనలిటిక్స్ ఇండియా సర్వే పేర్కొంది. 2024 చివరికి ఆ కంపెనీ దివాలా తీయవచ్చని అనలిటిక్స్ ఇండియా మేగజైన్ తన నివేదికలో వెల్లడించింది. ఈ ఓపెన్ ఏఐ సంస్థను సామ్ ఆల్ట్‌మన్ 2022 నవంబర్‌లో స్థాపించారు. జీపీటీ -3.5, జీపీటీ-4 వాడుకునేందుకు డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ ఆ సంస్థ సరిపడా ఆదాయం సమకూర్చుకోలేకపోతోంది. ఇప్పట్లో బ్రేక్ ఈవెన్ రావడం కష్టమేనని నిపుణులు అంటున్నారు. ఓపెన్ ఏఐని నడిపించేందుకు ప్రతి రోజూ 7 లక్షల డాలర్లు (రూ.5.8 కోట్లు) ఖర్చవుతోందని అంచనా. ఆ స్థాయిలో ఆదాయం మాత్రం రావడం లేదు. మొదట్లో దీనిని అత్యధికమంది ఉపయోగించేవారు. క్రమంగా వారి సంఖ్య తగ్గుతోంది. జూన్‌లో 170 కోట్ల మంది చాట్ జీపీటీని ఉపయోగించుకోగా, జులై నాటికి వారి సంఖ్య 150 కోట్లకు తగ్గింది. అంటే 12 శాతం పడిపోయింది. దాంతో సంస్థ నష్టాల్లో ఉంది. అయితే, 2023 చివరికి 200 మిలియన్ డాలర్ల ఆదాయం వస్తుందని ఓపెన్ ఏఐ అంచనా వేస్తోంది. 2024 నాటికి బిలియన్ డాలర్ కంపెనీగా అవతరిస్తుందని పేర్కొంది.వినియోగదారుల సంఖ్యను పెంచుకునేందుకు ఓపెన్ ఏఐ సంస్థ తాజాగా చాట్ జీపీటీ-4 అప్ డేట్ వెర్షన్‌ను తీసుకొచ్చింది. ఇది దాదాపు మనిషిలాగే పనిచేస్తుందని సంస్థ తెలిపింది. ఈ కొత్త వెర్షన్ మరింత సురక్షితంగా ఉంటుందని ఓపెన్ ఏఐ తన బ్లాగ్‌లో పేర్కొంది. క్లిష్టమైన ప్రశ్నలు, సమస్యలకు కూడా కచ్చితమైన సమాధానాలు ఇస్తుందని ఓపెన్ ఏఐ తెలిపింది. భవిష్యత్‌లో ఇమేజ్‌ల రూపంలో ప్రశ్నలు అడిగినా సమాధానాలు చెప్పేలా చాట్ జీపీటీ 4ను రూపొందించారు. చివరకు ఉద్యోగులే దాని కచ్చితత్వాన్ని పరిశీలించవలసి ఉంటుంది. అందువల్ల చాట్ జీపీటీ అభివృద్ధి చెందే క్రమంలో కొన్ని ఒడిదుడుకులు వచ్చినప్పటికీ ఆయా సంస్థలు ఉద్యోగాల సంఖ్యను భారీగా తగ్గించే అవకాశాలు చాలా తక్కువ ఉంటాయి. అయితే, ఈ చాట్ జీపీటీ సైబర్ దాడులకు ఉపయోగపడే ప్రమాదం ఉందని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

**గన్నవరం- ప్రభాత సూర్యుడు :**

కృష్ణాజిల్లా కేసరపల్లి వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదంజరిగింది. గన్నవరం మండలం కేసరపల్లి వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్యాభర్తల్ని భారీ టస్కర్ లారీ ఢీకొట్టింది. ఏలూరు వైపు నుండి విజయవాడ వైపు వెళ్లే క్రమంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో సంఘటన స్థలంలో నే మహిళ మృతి చెందింది. ఆమె న మహిళ, అవయవాలు ఛిద్రమై చెల్లచెదురై గుండె రోడ్డుపై కొద్దిసేపు కొట్టుకుంది. మృతురాలు చనిపోయిన మహిళ విజయవాడ యనమలకుదురుకు చెందిన పల్లవి (33 )గా గుర్తించారు. భర్త మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అనారోగ్యం కారణంగా గన్నవరం మండలం చిన్న ఆవూటపల్లి పిన్నమనేని సిద్ధార్థ హాస్పటల్ కి వెళ్లి వస్తుండగా ఘటన జరిగింది. సంఘటన స్థలానికి చేరుకున్న గన్నవరం పోలీసులు మృతదేహాన్ని అంబులెన్స్ లో విజయవాడ గవర్నమెంట్ హాస్పిటల్ తరలించారు.

# నాలుగు రైళ్ల గమ్యస్థానం పొడిగింపు

## జెండా ఊపి ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి





**సికింద్రాబాద్- ప్రభాత సూర్యుడు**

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ లో కాజిపేట-హడప్సర్ (పుణే) రైలును కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి సోమవారం ఉదయం జెండా ఊపి ప్రారంభించారు. దీంతోపాటుగా మరో మూడు రైళ్లను వర్చువల్ గా ప్రారంభించారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే నాల్గు రైళ్ళను పొడిగించింది.

కిషన్ రెడ్డి మాట్లాడుతూ భారత ప్రభుత్వం రైల్వే మంత్రిత్వ శాఖ మరోసారి సాహసోపేతమైనా నిర్ణయంతో రెండు తెలుగు రాష్ట్రాలలో రైళ్ల పొడగింపుతో పురోగతి సాధించింది. వేల కోట్ల రూపాయల వ్యయంతో కొత్త ప్రాజెక్ట్స్ నిర్మాణం జరుగుతున్నాయి. . హడప్సర్ -హైదరాబాద్ ఎక్స్ ప్రెస్ కాజీపేట వరకు, జైపూర్ - కాచిగూడ ఎక్స్ప్రెస్ ను కర్నూల్ పట్టణం వరకు, నాందేడ్ - తాండూర్ ఎక్స్ప్రెస్ ను రాయచుర్ వరకు, కరీంనగర్ - నిజామాబాదు పాసెంజర్ ను బోధన్ వరకు పోడిగించారు. తెలుగు రాష్టలలోని,వివిధ ప్రాంతాలలో రైళ్ల సర్వీస్లలో పొడగింపు, అదనపు ప్రయాణ సౌకర్యాలతో ప్రజల అవసరాలు తీరానున్నాయి. కాజీపేట నుంచి నేరుగా పూణె వెళ్లడానికి ఈ ట్రైన్ను ఎక్స్టెండ్ చేస్తున్నాం. రాయలసీమ నుంచి నేరుగా జైపూర్ వెళ్లడానికి కొత్త ఎక్స్టెన్షన్ లైన్ చేస్తున్నం. సికింద్రాబాద్ నుంచి జైపూర్కు ఉండే సర్వీస్ను.. దాన్ని కర్నూల్ వరకు ఎక్స్టెండ్ చేస్తున్నామన్నారు.

కరీంనగర్ నుంచి నిజామాబాద్ వరకు ఉన్న ట్రైన్ సర్వీస్ను బోధన్ వరకు ఎక్స్టెండ్ చేస్తున్నాం. ప్రధాని మోడీ తెలంగాణలో రైల్వే నెట్ వర్క్ పెంచేందుకు కృషి చేస్తున్నారు. రాయచూర్ నుంచి తాండూర్ సర్వీస్ను కూడా ఎక్స్టెండ్ చేస్తున్నాం. గత సంవత్సరం ప్రధాని మోడీ రెండో వందే భారత్ ట్రైన్ను ప్రారంభించారు. హైదరాబాద్ టు బెంగళూరు వందే భారత్ ట్రైన్ను ఇటీవల ప్రధాని ప్రారంభించారు. దేశంలో 33 వందే భారత్ రైళ్లు ఉంటే.. తెలంగాణకు మూడు వందే భారత్లు రావడం గర్వకారణం. 2014లో తెలంగాణ రైల్వే బడ్జెట్ 258 కోట్లు అప్పటి ప్రభుత్వం పెడితే.. ఈరోజు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది 5 వేల కోట్ల బడ్జెట్ పెట్టింది. దాదాపు 31 వేల కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. కోట్లాది రూపాయలతో సికింద్రాబాద్ సహా అన్ని రైల్వే స్టేషన్ల ఆధునీకరణ జరుగుతున్నది.

కాచిగూడ, నాంపల్లిల ఆధునీకరణతోపాటు అదనంగా చర్లపల్లి రైల్వే టెర్మినల్ నిర్మాణానికి కేంద్రం కృషి చేస్తున్నది. వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభించుకోబోతున్నాం. ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్ ప్రాజెక్టును ప్రధాని స్వయంగా ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే.. యాదాద్రి వరకు దాన్ని ఎక్స్టెండ్ చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉంది.

కాజీపేటలో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ వేగంగా నిర్మాణం జరుగుతోంది. తెలంగాణలో ఎక్కడెక్కడ కొత్త రైల్వే ప్రాజెక్టులు అవసరం ఉన్నయనేదానిపై సర్వే కోసం కేంద్రం నిధులు మంజూరు చేసింది. వేలాది కోట్ల రూపాయలతో కొత్త ప్రాజెక్టులకు సర్వే జరుగుతోంది. భవిష్యత్లో తప్పకుండా రైల్వే నెట్ వర్క్ పెంచే ప్రయత్నం చేస్తున్నాం. కొంత మంది మంత్రులు, నాయకులు.. రైల్వే నెట్ వర్క్ పెరగకుండా కొత్త ప్రాజెక్టులు వస్తే సహకరించడం లేదు. సిద్దిపేట రైల్వే స్టేషన్లో ముఖ్యమంత్రి కుటుంబసభ్యులు.. కనీస విలువలు పాటించకుండా.. రైల్వే అధికారిని ఇష్టమొచ్చినట్లు తిట్టారు. సదరు నేత సొంత అసెంబ్లీ నియోజకవర్గానికి రైలు తీసుకొస్తే.. అధికారులపట్ల అనుచితంగా ప్రవర్తించడం బాధాకరం. రైల్వే ఆస్తులను ధ్వంసం చేసిన రూలింగ్ పార్టీ నేతలకు తెలంగాణ ప్రజలు సరైన బుద్ధి చెబుతారు. ఎవరు సహకరించినా.. సహకరించకపోయినా.. తెలంగాణలో రైల్వే నెట్ వర్క్ను పెంచి తీరుతాం. ? ఈ రోజు ప్రారంభించే నాలుగు రైళ్ల ద్వారా ఎవరెవరికి ప్రయోజనం చేకూరుతుందో.. వాళ్ల అందరి తరఫున ప్రధాని మోడీ కి ధన్యవాదాలు చెబున్నానని అన్నారు.

# కాంగ్రెసోళ్లను నమ్మేవాళ్లున్నారా..!

(మొదటిపేజీ తరువాయి)

విచ్చేసిన మంత్రి కేటీఆర్ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరకాల నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్‌తో కొట్లాడి రూ.5,500కోట్లు నిధులు తీసుకువచ్చి ఎన్నో రకాలుగా అభివృద్ధి చేశారని అన్నారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా పరకాల నియోజకవర్గంలో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ రాకముందుకు 60 ఏళ్లపాటు కాంగ్రెసోళ్లు తెలంగాణను పీక్కతిన్నారని, తెలంగాణ వస్తే కరెంటే ఉండదని ఎద్దేవా చేశారన్నారు. రూ.200 ఫించన్ ఇవ్వనోళ్లు రూ.4వేలు ఫించను ఇస్తామనడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులందరు కూర్చొని మనసునిండా ఆలోచన చేసి గుండెపై చెయ్యి వేసుకొని కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులను రాజులుగా చేయడం కోసం సీఎం కేసీఆర్ వినూత్న రీతిలో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వ్యవసాయ పెట్టుబడుల కోసం 70లక్షల మంది రైతులకు గాను రూ.73 కోట్లు నిధులను అందిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పరిపాలనలో రూ.29లక్షల మందికి పింఛన్ అందిస్తే.. బీఆర్ఎస్ ప్రభు త్వం 46లక్షల మందికి ఫించన్ ఇస్తోందన్నారు. బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, వికలాంగులు మరో రెండున్నర లక్షల మంది ఉంటారని, వారికి కూడా అందిస్తామని అన్నారు. రేపో మాపో పులి బయటకు వస్తుందని.. ఇ ప్పుడు ఎగిరే నక్కలన్నీ పారిపోతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి నేటివరకు అభ్యర్థే లేదని ఎద్దేవా చేశారు. మొనగాడు కేసీఆర్ మోసగాళ్లు కాంగ్రెసోళ్ల మధ్య పోటీ జరుగుతోందన్నారు. ఢిల్లీ, గుజరాత్ గులాంలు తెలంగాణకు అవసరమా అని అన్నారు. మనదగ్గర నంబర్‌వన్ సీఎంను పెట్టుకొని ఎవరిదిక్కో చూడడం మనకు అవసరం లేదని అన్నారు. కాంగ్రెసోళ్లు కర్ణాటక నుంచి, బీజేపోళ్లు గుజరాత్ నుంచి ఎన్నికల కోసం డబ్బులు తీసుకువస్తున్నారని, వాటిని తీసుకొని కారుగుర్తుకు ఓటువేయాలని కోరారు. కాంగ్రెస్ గెలిస్తే యేడాదికి ఒక ముఖ్యమంత్రి మారుతాడని, అదే బీఆర్ఎస్ గెలిస్తే కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతాడని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు దేశంలో ఎక్కడాలేని విధంగా వివిధ పథకాలను ప్రవేశపడుతూ రాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దారన్నారు. అది ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు వచ్చిరాని మాటలు చెబుతూ నేడు పరకాల బంద్‌కు పిలుపునిచ్చారని అన్నారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ మాట్లాడుతూ.. 2006లో పరకాలలో ఎంతోమంది పత్తి రైతులు సరైన పంటలు పండక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయని, తెలంగాణ వచ్చినప్పటి నుంచి రైతుల ఆత్మహత్యలు అనేటివే లేవని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ రాష్ట్ర అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ధర్మారెడ్డి గెలుపుకోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదేవిధంగా పరకాలకు చెందిన చాలామంది ఓటర్లు హనుమకొండలో ఉన్నారని, తన గెలుపుకోసం కూడా సహకరించాలని కోరారు. వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ.. దళితుల పట్ల సీఎం కేసీఆర్ ఎంతో శ్రద్ధ చూపుతారని. రాష్ట్రంలో వెయ్యికిపైగా సోషల్ వెల్ఫేర్ స్కూళ్లు ఏర్పాటు చేశారని అన్నారు. దళితబంధు పథకంతో ఎంతోమంది దళితుల కుటుంబాల్లో వెలుగులు నింపడం జరిగిందని తెలిపారు. మునిసిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత, వైస్ చైర్మన్ రేగూరి జయపాల్‌రెడ్డి, ఎంపీపీ స్వర్ణలత, లింగంపెల్లి కిషన్‌రావు, సదానందం, బండి సారంగపాణి, సిలివేరు మొగిళి, మడికొండ శ్రీను, నిప్పాని హైమావతి పాల్గొన్నారు.

# ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సీఎం కేసీఆర్ సర్కారు తీపికబురు అందించింది. రాష్ట్రంలోని ఉద్యోగులు, పింఛనర్ల కోసం 'ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్'ను ఏర్పాటు చేశారు. ఈ కొత్త 'ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఇఉహా)' అమలుకు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. దీనిద్వారా ఉద్యోగులు, పింఛనర్లతో పాటు కుటుంబసభ్యులకూ ప్రయోజనం కలగనుంది.పథకం నిర్వహణకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో బోర్డును ఏర్పాటు చేశారు. అధికారులు, ఉద్యోగులు, పింఛనర్లు సభ్యులుగా వ్యవహరిస్తారు. దీనికి సంబంధించి జీవో నంబర్ 186ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఉద్యోగుల విరాళంతోనే ఈ కొత్త పథకం అమలుకానుంది. బిస్వాల్ కమిటీ సిఫారసుల మేరకు కొత్త పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉద్యోగులందరికీ సమాన విరాళంతో సమాన చికిత్స అనే విధానాన్ని అమలు చేయనున్నారు. ఉద్యోగులు, పింఛనర్లకు హెల్త్ స్కీమ్ అమలు సంతోషకరమని మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రత్యేకంగా ట్రస్ట్ ఏర్పాటుపై సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నూతన విధానంతో ఉద్యోగులు, పింఛనర్లు, కుటుంబీకులకు మెరుగైన వైద్య సేవలు లభిస్తాయన్నారు. ఉద్యోగులు, పింఛనర్ల సంక్షేమానికి భారాస ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని అదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న వెల్లడించారు. బట్టి సావర్గామ గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం ఎమ్మెల్యే జోగు రామన్న ఇళ్ల స్థలాల కోసం భూమి పూజ చేశారు. ఆదిలాబాద్ జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఇండ్ల స్థలాల కల నెరవేరిందని ఎమ్మెల్యే రామన్న అన్నారు. ముందుగా జర్నలిస్ట్ జేఏసీ సభ్యులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ . ఆదిలాబాద్ లో ఎన్నో ఏళ్లుగా ఇంటి స్థలాల కోసం జర్నలిస్టులు చేసిన పోరాటం ఫలించింది అని అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు కేటాయిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించామని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టులకు స్థలాల కేటాయింపు నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. జేఏసీ పోరాటంతో పాత్రికేయుల సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

## ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల ప్రారంభం



**అబ్దుల్లాపూర్ మెట్ – ప్రభాత సూర్యుడు :** రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలోని తట్టి అన్నారంలో 1 ఎంఎల్ , కుంట్లూరులో 2 ఎంఎల్, పెద్ద అంబర్ పేట్ లో 1 ఎంఎల్ సామర్థ్యం గల మంచినీటి ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను సోమవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. 6 కోట్ల రూపాయల నిధులతో నిర్మించిన ఈ ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు త్వరలో మున్సిపాలిటీ ప్రజలకు అందుబాటులోకి రానున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ అధికారులు, హెచ్ఎండ బ్ల్యూఎస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## విడతల వారీగా గ్రామాల అభివృద్ధి

**- జడ్పీటీసీ మర్రి నిత్య నిరంజన్ రెడ్డి**



**మంచాల:-ప్రభాత సూర్యుడు :** మంచాల మండలంలోని ఆగపల్లి గ్రామంలో జడ్పీటీసీ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు ముక్కెరి. శంకరయ్య ఇంటినుండి గోసుల. సుక్కాలు ఇంట వరకు, సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. తదనంతరం గ్రామ పంచాయతీ ఆవరణము లో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోసుల. జంగయ, వార్డు సభ్యులు ప్రేమలత, వంగూరి. పద్మ, శ్రీనివాస్, యాదయ్య, పంచాయతీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బాబురావు, యాదమ్మ, బాలయ్య, కల్పన, లావణ్య, బాలశివుడు, గ్రామ పంచాయతీ సిబ్బంది, కారోబార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## యాచారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణి

**- ఎంపీపీ కొప్పుసుకన్య బాషా జెడ్పిటిసి చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య**



**యాచారం – ప్రభాత సూర్యుడు :** యాచారం మండల కేంద్రంలోని కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ నిర్వహించారు. నూతనంగా వివాహం జరిగినటువంటి 64 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్లను ప్రజాప్రతినిధులు మరియు అధికారులతో కలసి పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో , ఎమ్మార్వో శ్రీకాంత్ రెడ్డి , ఆర్ ఐ రామకృష్ణ , పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు

**అబ్దుల్లాపూర్ మెట్ – ప్రభాత సూర్యుడు :**

విజయవాడ జాతీయ రహదారిపై అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులు సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీలు చేపట్టారు. సోమవారం నుండి ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో వాహనాల తలకీలు చేపట్టామని, ఇదేవిధంగా ప్రతిరోజు వాహనాల తనిఖీలు జరుపుతామని ఇన్స్పెక్టర్ మన్మోహన్ యాదవ్ తెలిపారు.




# పివైఎల్ రాష్ట్ర 8వ మహాసభలను జయప్రదం చేయండి

**- పాల్వంచ డివిజన్ కార్యదర్శి కోర్స రామకృష్ణ**




**ములకలపల్లి – ప్రభాత సూర్యుడు :**

పివైఎల్ 8 వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పివైఎల్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి కోర్సా రామకృష్ణ పిలుపునిచ్చారు. త్యాగాలకు, పోరాటాలకు పురిటి గడ్డ మానుకోట జిల్లా కేంద్రంలో ప్రగతి శీల యువజన సంఘం పివైఎల్ రాష్ట్ర 8వ మహాసభలు అక్టోబర్ 12,13వ తేదీలలో జరుగు తాయని, ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ ముద్రించిన గోడ ప్రతిని పివైఎల్ పాల్వంచ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ములకలపల్లి మండల కేంద్రంలో ఆవిష్క రించారు, ఈ సందర్భంగా పివైఎల్ డివిజన్ ప్రదాన కార్యదర్శి కొర్సా రామకృష్ణ మాట్లాడుతూ..ప్రపంచంలో అత్యధిక యువ సంపద కలిగిన దేశం మనదని, కానీ ఆ యువతను సరైన మార్గంలో నడిపించే బాధ్యతను పాల కులు విస్మరించారని అన్నారు. యువతను అన్ని రంగాల్లో రాణించేలా అవకాశాలు కల్పించకుండా రాజకీయ నాయకులకు పావులుగా వాడుకున్నారని, ప్రశ్నించే తత్వాన్ని మృగ్య పరుస్తూ మరుగుజ్జులుగా తయారు చేస్తున్నారని అన్నారు. గుట్కా,మద్యం, ఇతర మాదక ద్రవ్యాలు, మత్తు పానీయాలకు బానిసలుగా మార్చే స్తున్నారని అన్నారు. రాష్ట్ర మహాసభలలో యువతరం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు,పోరాటాలు రూపకల్పన చేసుకునేందుకు ఈ మహాసభలు దోహదపడతాయని అన్నారు.యువత అధిక సంఖ్యలో పాల్గొని సభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పివైఎల్ నాయకులు వాసం బుచ్చిరాజు బడిశ లక్ష్మణరావు,ఒరుగంటి శ్రీను,రాచన్నగూడెం సర్పంచ్ కొర్సా గణపతి,కీసరి రాము,కీసరి వీరభద్రం,నకిరకంటి నాగేశ్వరరావు,సోయం రాము,సోయం చంటి తదితరులు పాల్గొన్నారు.

### ఎప్పుడు ఎన్నికలు వచ్చినా

# ఇబ్రహీంపట్నం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

**- టిపిసిసి ఉపాధ్యక్షులు మల్ రెడ్డి రంగారెడ్డి**



**ఇబ్రహీంపట్నం:-ప్రభాత సూర్యుడు :**

ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని మల్ రెడ్డి రంగారెడ్డి వెల్లడించారు .దండు మైలారం పోచారం గ్రామాల నుండి వివిధ పార్టీల నుండి వందలాది మంది యువకులు మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు.వందలాది మంది యువకులు రాకతో కిటకిటలాడిన మల్ రెడ్డి రంగారెడ్డి క్యాంపు కార్యాలయం. కాంగ్రెస్ కార్యకర్తల్లో ఫుల్ జోష్.యువతని మభ్యపెట్టి మోసం చేసిన బిఆర్ఎస్ పార్టీకి ఇబ్రహీంపట్నంలో డిపాజిట్లు గల్లంతు కావడం కాయం. ఇబ్రహీంపట్నం మండలం దండు మైలారం పోచారం గ్రామాల నుండి దాదాపు 500 మంది యువకులు ఆదివారం ఉదయం తొర్రూరు గ్రామంలోని టీపీసీసీ ఉపాధ్యక్షులు ఇబ్రహీంపట్నం ముద్దుబిడ్డ మల్ రెడ్డి రంగారెడ్డి క్యాంపు కార్యాలయంలో పెద్ద ఎత్తున ర్యాలీగా విచ్చేసి మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా టిపిసిసి ఉపాధ్యక్షులు మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా యువతకు ఉద్యోగాలు ఇస్తానని నిరుద్యోగ భృతి ఇస్తానని కేజీ టు పేజీ వరకు ఉచిత విద్య అమలు చేస్తానని మోసం చేసిన కల్వకుంట్ల కుటుంబానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు. నియోజ కవర్గంలో వేలాది మంది యువత టిఆర్ఎస్ పార్టీని బొంద పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని దొంగ ఓట్లతో దొడ్డిదారిన గెలిచిన అవినీతి మంచిరెడ్డి కిషన్ రెడ్డికి పట్నం ప్రజలు ఇంటికి పంపడం ఖాయమైందని అన్నారు. సోనియా గాంధీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ స్కీములను ప్రజల్లోకి తీసుకు వెళు _న్నామని నియోజకవర్గ ప్రజలు స్వచ్ఛందంగా హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

ఇబ్రహీంపట్నం నియో జకవర్గంలో అవినీతి రాజ్యమేలుతుందని అధికార పార్టీ నాయకులు ధరణి పేరుతో భూమాఫియాకు పాల్పడు తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజల భవిష్యత్తు బాగుపడుతుందని మహిళలు రైతులు వృద్ధులు నిరుద్యోగులు విద్యార్థులు సంతోషంగా ఉంటారని తెలియజేశారు. రాబోయే రోజుల్లో పట్నం నియోజకవర్గం లో బిఆర్ఎస్ పార్టీ ఖాళీ అయ్యే పరిస్థితి వస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జడ్పీ ఫ్లోర్ లీడర్. భూపతి గళ్ళ మహిపాల్.. చిలుక మధుసూదన్ రెడ్డి,కప్పరి చందు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మంకాల కరుణాకర్, దండు మైలారం కాంగ్రెస్ పార్టీ గ్రామ పెద్దలు ఎంపీటీసీ పిట్టల అనసూయ సీతయ్య,రావణమోని లింగం ముదిరాజ్,రవి,బాల్ రాజ్ ,గుత్తా రాజశేఖర్ రెడ్డి, నిట్టు గాలయ్య, పోచారం గ్రామ కాంగ్రెస్ పార్టీ పెద్దలు తాళ్లపల్లి వెంకటేష్, రామారావు,చిన్న,లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ పాలనలో అద్వితీయ ప్రగతి

**- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**

**-ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 20.08 కోట్ల అభివృద్ధి పనులకు**

**ఇబ్రహీంపట్నం – ప్రభాత సూర్యుడు :**



సమర్థ పాలకుడు కేసీఆర్ దార్శనిక పాలనలో పల్లెలు పట్టణాలు సమాంతరంగా అభివృద్ధి చెందుతున్నాయని, తెలంగాణ అద్వితీయ ప్రగతిని సాధిస్తుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో 20 కోట్ల 8 లక్షలరూపాయల అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారం భోత్సవాలు శంకుస్థాపనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడక ముందు ఏడాదికి లక్ష రూపాయల అభివృద్ధి పనులను సాధించడం గగనంగా ఉండేదని గుర్తు చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ముందుచూపుతో నాలుగు మున్సిపాలిటీలు ఏర్పాటు చేసి ప్రభుత్వం నుండి అధిక నిధులు రాబట్టగలగామని చెప్పారు. ఖానాపూర్ గేటు నుండి కృష్ణ వాటర్ పైప్ లైన్ వెంబడి బైపాస్ రోడ్డు నిర్మాణానికి 3.5 కోట్లు కేటాయించామని చెప్పారు. ఇబ్రహీంపట్నం కట్టమీద నుండి నాగన్ పల్లి రోడ్డు వరకు ఇదివరకే బైపాస్ రోడ్డులో 2 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. బైపాస్ రోడ్డు పూర్తయితే మంచాల రోడ్డు, రాయపోల్ రోడ్డు, నాగన్ పల్లి రోడ్డు వైపు అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందన్నారు. అంబేద్కర్ చౌరస్తా నుండి ప్రభుత్వ ధావాఖాన వరకు 2.5 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేయబడుతున్నట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణానికి మరో 10కోట్లు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. 75లక్షల రూపాయల వ్యయంతో గ్రంథాలయాన్ని ఆధునికరిస్తున్నారు. 2 కోట్ల వ్యయంతో రజకులకు అధునాతన దోబీఘాట్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతామని అడ్డమైన వారి మాటలు పట్టించుకోమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, చైర్ పర్సన్ స్రవంతి, వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, ఎంపీపీ కృపేష్, సీనియర్ నాయకులు జక్క రామ్ రెడ్డి, మహేష్ గౌడ్, కాయితి మోహన్ రెడ్డి, పీఏసిఎస్ చైర్మన్ మొద్దు అంజిరెడ్డి, కౌన్సిలర్లు ముత్యాల భాస్కర్, భాను గౌడ్, భర్తాకి జగన్, యాచారం సుజాత రవి, మంద సుధాకర్, సుల్తాన్, కొంద్రు శ్రీలత, శంకరయ్య, మోహన్ నాయక్, మమత, పద్మ మల్లేష్ యాదవ్, నరాల విశాల, అల్వాల జ్యోతి, ముత్యాల లక్ష్మీ ప్రసన్న చిన్న, నాయిని సత్యనారాయణ, బర్ల మంగ జగన్, నీలం శ్వేత బాలు, జోర్కొని బాలరాజు, కమిషనర్ రవిద్ర, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు అల్వాల వెంకట్ రెడ్డి, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు జెర్కొని రాజు, మాజీ చైర్మన్ భరత్, మున్సిపల్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మడుపు శివ సాయి, ఎంపిటిసి భరత్ రెడ్డి బంటీ యూత్ ఫోర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కిషన్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తా

**- మొండిగౌరెల్లి సర్పంచ్ బండిమీది కృష్ణ మాదిగ**

**యాచారం – ప్రభాత సూర్యుడు :**

యాచారం మండల పరిధిలోని మొండి గౌరెల్లి గ్రామంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని మొండిగౌరెల్లి సర్పంచ్ బండిమీది కృష్ణ మాదిగ అన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సహకారంతో ఎస్ డి ఎఫ్ నిధులు అండర్ డ్రైనేజీ 4 లక్షలు, సీసీ రోడ్డు 6 లక్షలు మొత్తం 10 లక్షల రూపాయలతో పనులకు ప్రారంభించారు. ఎమ్మెల్యే కిషన్ రెడ్డి పేదల సంక్షేమం కోసం పాటు పడుతు న్నారని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందు తున్నాయని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం వైపే ప్రజలు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తాంద్ర లక్ష్మమ్మ, వార్డు సభ్యులు మొగిలి అంజమ్మ, కుంటి రేణుక పాండు, సెక్రటరీ రాంబాబు, గ్రామప్రజలు కృష్ణయ్య, రవీందర్, మేకల యాదయ్య, గుర్రం షెలమ్మ రెడ్డి, కుంటి రాజు తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215